అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 286 | వరంగల్ | మంగళవారం, 18 ఆగస్టు 2026 | పేజీలు: 7



పరకాలలో పార్టీ బలోపేతానికి కృషి చేశా

డీసీసీ అధ్యక్షునిగా రాహుల్ గాంధీ ఆలోచనలతో ప్రయాణం

కాంగ్రెస్ పార్టీ మేయర్ పదవి సొంతం చేసుకుంటుంది

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి

డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

# కాంగ్రెస్ పార్టీ సైనికుడిని..

## ప్రజలు, కార్యకర్తలతో ఉండడమే ఇష్టం



విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో 1985లో ఖమ్మం జిల్లాలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఎస్ఎఫ్ఐ విభాగంలో పనిచేసిన అనుభవం, కుటుంబంలో మామ చంద్ర శేఖర్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా ఉండడం వల్ల రాజకీయ వాతావరణం ఇనగాలకు కొత్త కాదు. 2012లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, అనేక ఆటుపోట్లు ఎదుర్కొని, క్రమశిక్షణ గలిగిన కాంగ్రెస్ సైనికుడిగా ఎదిగానని ఇనగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు, కార్యకర్తలతో ఉంటూ, పార్టీ ఆదేశాల మేరకు ఎక్కడ పని చెయ్యమని చెప్పినా అక్కడ పూర్తి నిబద్ధతతో పని చేస్తానని, పరకాల కాంగ్రెస్ పటిష్ఠతకు శక్తి వంచన లేకుండా కృషి చేశానని, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ గా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చానని, డీసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఆలోచనలతో ప్రయాణం చేస్తున్న అని చెబుతూ వచ్చే ఎన్నికల నాటికి పార్టీ నుంచి పోటీలో ఉంటా అని అనేక విషయాలను డిజిటల్ మీడియాతో పంచుకున్నారు.

*- అక్షరశక్తి, హన్మకొండ*

5

# భద్రకాళి బండ్‌పై బ్యాటరీ వెహికల్

**సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని... పాల్గొన్న జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్**

అక్షరశక్తి, హన్మకొండ : భద్రకాళి బండ్ పై సందర్శకుల సౌకర్యార్థం బ్యాటరీ వెహికల్ సేవలు మంగళవారం అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ ను ప్రారంభించారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బ్యాటరీ వెహికల్ ను ప్రారంభించిన అనంతరం కుడా సిపిఓ అజిత్ రెడ్డి నడపగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి,

3



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- అన్నీ వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాల అమలు
- జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్
- కలెక్టరేట్‌లో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమం

4





## మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల భేటీ



**అక్షరశక్తి,వరంగల్:** కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (KNRUHS) నూతన రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డా. జె.వి. వెంకటేశ్వర్లును మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లోజు సత్యనారాయణ చారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. జె.వి. వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందజేశారు. అనంతరం మెడికల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను కోరారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారి విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల రవీందర్, రుద్రోజు మణీంద్రనాథ్, బుట్టి శ్యామ్ యాదవ్ పాల్గొన్నారు.

## పెద్ది విగ్రహాన్ని కూల్చడం అమానుషం







**అక్షరశక్తి, హన్మకొండ :** దివంగత నేత, తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చడాన్ని నిరసిస్తూ చలో నర్సంపేట కార్యక్రమానికి బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో ముందస్తుగా వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి, హనుమకొండ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మాట్లాడుతూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్స్ చెన్నం మధు, సోదా కిరణ్, మైనార్టీ కమిషన్ మాజీ సభ్యులు జాని దర్శన్ సింగ్, 4వ డివిజన్ అధ్యక్షులు కంజర్ల మనోజ్, బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్, పార్టీ నాయకులు మంద శ్యామ్, పుష్పలత, నాయకులు రాసురి రాజేష్, డాక్టర్ పాలమాకుల కొమరయ్య, కలకోట్ల సుమన్, సంగాని సూర్యకిరణ్ వర్మ, గొల్లపెల్లి వీరస్వామి తదితర తెలంగాణ ఉద్యమకారులు ఉన్నారు.

## నేడు కేయూ స్వర్ణోత్సవ వేడుకలు

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం, స్వర్ణోత్సవ వేడుకలు ఆగస్టు 19, 2026 (బుధవారం) ఉదయం 11.00 గంటలకు విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలోని సెనెట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయ 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విద్యా, పరిశోధనా విజయాలు, సంస్థాగత అభివృద్ధి, ఉన్నత విద్యారంగానికి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకోనున్నారు. వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి సభను ఉద్దేశించి విశ్వవిద్యాలయ ప్రస్థానం, విజయాలు, భవిష్యత్ దార్శనికతపై ప్రసంగించనున్నారు. విశ్వవిద్యాలయ వారసత్వాన్ని స్మరించుకుంటూ, విద్యా నాణ్యత, పరిశోధన, సంస్థాగత అభివృద్ధి పట్ల నిబద్ధతను పునరుద్ఘాటించే ఈ వేడుకల్లో బోధనా, బోధనేతర సిబ్బంది, పాల్గొని విజయవంతం చేయాలని రిజిస్ట్రార్ కోరారు.

# విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకుని కాపాడాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాకతీయ వైద్య కళాశాలలో ఘనంగా మెగా ప్లాంటేషన్ (వన మహోత్సవం)








**అక్షరశక్తి, వరంగల్:** విద్యార్థులు ఒక్కొక్కరు ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ వైద్య కళాశాల (కేఎంసి) వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ (వన మహోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, తదితరులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే భావనతో మొక్కలను కాపాడితే అవే మనలను కాపాడతాయని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని, దానికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తాము వైద్య కళాశాలలో ఐదేళ్లు చదువు పూర్తి చేసే సమయానికి, తాము దత్తత తీసుకున్న మొక్క కూడా ఐదేళ్ల పాటు పెరిగి పెద్దదిగా మారేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడంతో పాటు అనేక వ్యాధులను నివారించేందుకు కూడా దోహదపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. పెద్ద సంఖ్యలో మొక్కలను ఉచితంగా అందించి కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖ అధికారులను అభినందించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కాకతీయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలతో ఇంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ, కళాశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారునగరంలో భవిష్యత్తులో బహిరంగ ప్రదేశాలు తగ్గిపోయే పరిస్థితుల్లో కళాశాల ప్రాంగణం నగరానికి కీలకమైన గ్రీన్ స్పేస్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించి బతికించడం అంతకంటే ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం నాటిన మొక్కలను కనీసం వచ్చే ఏడాది వరకు జాగ్రత్తగా సంరక్షిస్తే వాటి మనుగడ శాతం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కాకతీయ వైద్య కళాశాల వంటి విద్యాసంస్థల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు, కళాశాల యాజమాన్యం తీసుకోవాలని అధికారులు సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ మాట్లాడుతూ, కాకతీయ వైద్య కళాశాలతో పూర్వ విద్యార్థులకు ఉన్న అనుబంధం, కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే బాధ్యతను ఈ కార్యక్రమం ద్వారా చాటుతున్నామని తెలిపారు. అటవీ శాఖ అధికారులు అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. మోహన్ దాస్, ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు, అటవీ శాఖ అధికారులు, పూర్వ విద్యార్థులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై సీపీఐ నిరంతర పోరాటాలు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- సీపీఎం నుంచి సీపీఐ లోకి భారీగా చేరికలు




**అక్షరశక్తి, హనుమకొండ :** ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతరము పోరాటాలు చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు.హనుమకొండ జిల్లా సీపీఎం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సీపీఐలో చేరారు. మంగళవారం సీపీఐ హనుమకొండ పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సమక్షంలో దాదాపు 100 కుటుంబాలు సీపీఐ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐలో చేరిన వారికి శ్రీనివాస రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులు, సమస్యల సాధన కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందని, ఈ పోరాటాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి సీపీఐలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని ప్రాంతాల్లో బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ సీపీఐ సిద్ధాంతాలు, ప్రజల పట్ల పార్టీకున్న కట్టుబాటు నచ్చి పార్టీలో చేరుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా సీపీఐ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సీపీఐలో చేరిన నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, నాయకులు అలకుంట యకయ్య, కంచర్ల కుమారస్వామి, నోముల కిషోర్, అలకుంట మల్లయ్య, ఎన్నాం వెంకటేశ్వర్లు, పల్లకొండ శ్రీకాంత్, కావ్యశ్రీ, దుర్గ, ప్రేమలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు








**అక్షరశక్తి, హనుమకొండ:** బహుజన చైతన్యానికి, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను పలు పార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుడికాల బాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో విస్తృతంగా పెట్టాలి అని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్,బీసీ అజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జినుకల లక్ష్మణ్ రావు, శివ సింహాద్రి, విగ్నేష్, అభిరామ్,విద్యార్థులు, పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

అలాగే, హనుమకొండ జిల్లా భారతీయ జనతా పార్టీ బీసి మోర్చ ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మార్క సునీల్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శివశక్తి స్థల్ హనుమకొండ చౌరస్తాలో పాపన్నగౌడ్‌ను నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వలుస అశోక్ కుమార్ హనుమకొండ జిల్లా కౌన్సిల్ మెంబర్, వీహెచ్పీ జిల్లా కార్యదర్శి సందీప్, కస్తూరి నవీన్ 9వ డివిజన్ అధ్యక్షులు, గండ్రాతి రాజు, ఎల్లా రెడ్డి తదితర బహుజన నాయకులు పాల్గొన్నారు.

అలాగే, హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో బహుజన వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వి.రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.సమ్మయ్య గౌడ్, ఏ.దిలీప్ గౌడ్, పి.విజయ్ కుమార్, కమలాదేవి, ప్రణదీర్ చౌహాన్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఆర్. ప్రవీణ్ కుమార్, సవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకఅధ్యాపకేతర బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

"అణగారిన వర్గాల ఆయుధమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్" అని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య రాజేందర్ కట్ల అన్నారు. విశ్వవిద్యాలయ బి. సి. సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ అధ్యక్షతన, విశ్వవిద్యాలయ ఆడిటోరియ ప్రాంగణం లోని సెల్ కార్యాలయం లో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొని, వాళులర్పించారు. ఓ ఎస్ డి ప్రో. బి. వెంకట్రామ్ రెడ్డి, అధ్యాపకులు పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డా. వి. సత్యనారాయణ, డా. సంకినేని వెంకట్, డా. సాదు రాజేష్, డా. తూర్పాటి వెంకటేష్, సాహితీ,శ్రీనివాస్,వంగాల సుధాకర్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు వల్లాల తిరుపతి, నవీన్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**అక్షరశక్తి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడు ఎలగొండ నవీన్ పై నేరం రుజువు కావడంతో, భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవన్ కుమార్ మంగళవారం నాడు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. 2021 సంవత్సరంలో భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలానికి చెందిన మైనర్ బాలిక హనుమకొండలో ఇంటర్ చదువుతున్న సమయంలో, ములుగు జిల్లా మల్లూరు శివారు మొట్లగూడెం గ్రామానికి చెందిన ఎలగొండ నవీన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పరుచుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి, 03042021న "పెళ్లి చేసుకుందాం" అంటూ ఇంటి నుంచి పిలిపించాడు. బాధితురాలు కాటారం మండలం బస్వాపూర్ చేరుకోగా, నిందితుడు ఆమెను ములుగు జిల్లా పస్రా మీదుగా బర్లగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి మూడు రోజుల పాటు నిర్బంధించి పలుమార్లు బలవంతంగా లైంగిక దాడి చేశాడు. అనంతరం తన స్వగ్రామమైన మొట్లగూడెంకు తీసుకెళ్లి మరో రెండు రోజుల పాటు అదే విధంగా దాడికి పాల్పడ్డాడు. తన కుమార్తె కనిపించకపోవడంతో బాధితురాలి తండ్రి కాటారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాధితురాలు ఇంటికి చేరి జరిగిన విషయాన్ని వెల్లడించింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం ఎస్‌హెచ్‌వో సాంబమూర్తి కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి కాటారం డీఎస్పీ బోనాల కిషన్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో లైజన్ ఆఫీసర్ వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ రమేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు విష్ణువర్ధన్ రావు, వెంకట్రామ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగా కోర్టు నిందితుడిపై నేరం రుజువైందని నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 1000 జరిమానా విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పని చేసిన ప్రస్తుత కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఆఫీసర్ పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రాజు, లైజన్ ఆఫీసర్ వెంకన్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రమేష్‌తో పాటు అప్పటి దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల పంపిణీ



**అక్షరశక్తి,వరంగల్:** సమగ్ర శిక్ష వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు.

దివ్యాంగ విద్యార్థులు విద్యను సులభంగా అభ్యసించడంతో పాటు వారి విద్యా ప్రగతికి తోడ్పడే విధంగా అవసరమైన వివిధ రకాల ఉపకరణాలను అందజేశారు. విద్యార్థుల ప్రత్యేక అవసరాలను గుర్తించి, వారికి అనువైన సహాయక పరికరాలను అందించడం ద్వారా పాఠశాలల్లో సమాన విద్యా అవకాశాలను కల్పించడమే సమగ్ర శిక్ష ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, వివిధ మండలాలకు చెందిన సమగ్ర విద్య వనరుల వ్యక్తులు (ఐఈఆర్‌పీలు) పాల్గొని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను అందజేశారు. దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, స్వావలంబనతో పాటు సమాజంలో వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

## భద్రకాళి బండ్‌పై
# బ్యాటరీ వెహికల్

- సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్



అక్షరశక్తి, హన్మకొండ : భద్రకాళి బండ్ పై సందర్శకుల సౌకర్యార్థం బ్యాటరీ వెహికల్ సేవలు మంగళవారం అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ ను ప్రారంభించారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బ్యాటరీ వెహికల్ ను ప్రారంభించిన అనంతరం కుడా సిపిఓ అజిత్ రెడ్డి నడపగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, తదితరులు భద్రకాళి బండ్ పై ప్రయాణించారు. ఫాతిమ కెనరా బ్యాంక్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ఫండ్స్ కింద కొనుగోలు చేసిన బ్యాటరీ వెహికల్ ను కుడా కు అందజేశారు. కాగా ఈ వెహికల్ ను ఎమ్మెల్యే చేతులకు మీదుగా ప్రారంభించడంతో సందర్శకుల సౌకర్యార్థం ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా కుడా ఈఈ భీమ్ రావు, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# రేగొండ పీఎస్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



**అక్షరశక్తి, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వార్షిక తనిఖీల్లో భాగంగా రేగొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, అనంతరం వన మహోత్సవంలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణతో పాటు పెండింగ్ కేసులు, CCTNS నమోదు, బ్లూ కోల్ట్ వాహనాల స్పందన, సీసీ కెమెరాల పనితీరును ఎస్పీ గారు సమీక్షించారు. స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, లోపాలు ఉన్న కెమెరాలను వెంటనే మరమ్మతు చేయించాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు CCTNSలో నవీకరించాలని సూచించారు. రౌడీ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, ప్రజలకు స్నేహపూర్వకంగా, పారదర్శకంగా సేవలు అందించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్ రావు, ఘనపూర్ సీఐ కర్ణాకర్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సూర్యశ్రీకి డాక్టరేట్



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ పరిశోధకురాలు సూర్యశ్రీ ఎరుకలకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ సూర్యశ్రీ ఎరుకల "SYNTTHESIS, CHARACTERIZATION AND BILOGICAL EVALUATION OF SCHIFF BASE METAL COMPLEXES" అనే అంశం పై విభాగ ఆచార్యులు ఆచార్య ఎస్. జ్యోతి పర్యవేక్షణలో పూర్తి చేసారు. ఈ సందర్భంగా హన్మకొండకు చెందిన డాక్టర్ సూర్యశ్రీని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ చెలగాటం

- ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**అక్షరశక్తి, హనుమకొండ :** వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ చెలగాటం ఆడుతున్నదని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు.అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ అధ్యక్షతన బాలసముద్రం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జాతీయ అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాసరావు  హాజరై మాట్లాడుతూ వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య —— ఏఐఎస్ఎఫ్ 90 వసంతాల ప్రస్థానంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి వార్షికోత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, యాదల్ల శరత్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కొండ చరణ్, బన్నీ, చిర సాయి, జిల్లా సమితి సభ్యులు కందగట్ల అజయ్, మల్లబోయిన రామ్ చరణ్, గుండేల్లి అవినాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎం.అరుణ్ కుమార్‌కు ప్రతిష్టాత్మక ఎంఏఎల్ఏ బెస్ట్ లైబ్రరియన్ అవార్డు 2026

**అక్షరశక్తి, హసన్‌పర్తి :** చెన్నైలోని కొట్టూరుపురంలో ఉన్న అన్నా శతజయంతి గ్రంథాలయంలో, ఆగస్టు 16, 2026న డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ గ్రంథాలయ నిపుణుల దినోత్సవ వేడుకలలో  బెస్ట్ లైబ్రరియన్  అవార్డును ప్రదానం చేశారు. లైబ్రరీ మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్ రంగంలో విశేష కృషి, అంకితభావంతో కూడిన సేవలు మరియు దీర్ఘకాలిక సహకారాన్ని గుర్తించి,  కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ వరంగల్ (కిట్స్‌డబ్ల్యూ) లైబ్రరీ అసిస్టెంట్ డాక్టర్ ఎం.అరుణ్ కుమార్ కి  ప్రతిష్టాత్మక 'మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ (ఎం ఏ ఎల్ ఏ) బెస్ట్ లైబ్రేరియన్ అవార్డు 2026'తో సత్కరించారు. గ్రంథాలయ మరియు సమాచార విజ్ఞాన శాస్త్ర రంగంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలలో అందించిన విశిష్ట వృత్తిపరమైన సేవలకు గుర్తింపుగా, డాక్టర్ ఎం.అరుణ్ ఎం ఏ ఎల్ ఏ ఉత్తమ గ్రంథపాలక పురస్కారం 2026'ను అందుకున్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎస్. ఆర్మ్‌స్ట్రాంగ్ మరియు కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. దొరస్వామి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ ఎం.అరుణ్ కుమార్ నిఅభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- అన్నీ వర్గాల ప్రజల కోసం  సంక్షేమ పథకాల అమలు
- జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్
- కలెక్టరేట్‌లో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమం



**అక్షరశక్తి,హన్మకొండ :** సర్దార్ సర్వాయి  పాపన్న గౌడ్  సామాజిక సమానత్వం, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చేసిన కృషి, ఆశయాలు, పోరాటాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి , అదనపు కలెక్టర్ రవి, హాజరై  సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ... సామాజిక న్యాయ పోరాటాలలో, బహుజన రాజ్యాధికార సాధనలో స్వయం సమృద్ధ గ్రామీణ పరిపాలనలో సర్వాయి పాపన్న  ప్రస్థానానికి అత్యున్నత చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. కుల, మత వివక్షలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ సమసమాజ స్థాపనకు బాటలు వేశారన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య కుటుంబంలో పుట్టి అన్యాయాలకు వ్యతిరేకంగా ఎదురించారని అన్నారు. ఓరుగల్లు అంటేనే పోరాటాల గడ్డ అని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి  గొప్పదన్నారు.  నగరంలో  మహనీయుల విగ్రహాలను పెట్టేందుకు తప్పకుండా తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.... సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్నీ వర్గాల ప్రజల  కోసం ప్రభుత్వం  సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# అర్వపల్లిలో పులి కలకలం..

**ప్రజల్లో భయాందోళన**

**అక్షరశక్తి,కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్వణపల్లి గ్రామంలో పులి సంచరించిందన్న వార్తలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. పులిని చూశానంటూ ఓ రైతు చెప్పడంతో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజల్లోనూ భయాందోళన నెలకొంది. అర్వణపల్లి గ్రామానికి చెందిన రైతు గండికోట కుమార్ తన పొలం వద్ద సాయంత్రం సమయంలో పులిని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు. పొలానికి వెళ్లిన సమయంలో పొదల్లో కదలిక కనిపించడంతో దగ్గరకు వెళ్లి చూడగా పెద్దపులి కనిపించిందని, భయంతో వెంటనే అక్కడి నుంచి పరుగెత్తుకుని వచ్చి గ్రామస్తులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

కుమార్ సమాచారంతో గ్రామస్తులు పులి కనిపించిందని చెబుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా అక్కడ కొన్ని పాదముద్రలు కనిపించినట్లు తెలిపారు. అవి పులి అడుగులేనని గ్రామస్తులు భావిస్తున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు.

పులి సంచారం నిజమే అయితే వెంటనే అటవీశాఖ అధికారులు స్పందించి పులిని గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. రైతులు, కూలీలు ఒంటరిగా పొలాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

అర్వణపల్లిలో పులి సంచరించిందన్న వార్తలపై అటవీశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి, పాదముద్రలు, ఇతర ఆనవాళ్లను శాస్త్రీయంగా పరిశీలించిన అనంతరం వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. అప్పటివరకు ప్రజలు అపోహలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.



# కాంగ్రెస్ పార్టీ సైనికుడిని..



- ప్రజలు, కార్యకర్తలతో ఉండడమే ఇష్టం
- పరకాలలో పార్టీ బలోపేతానికి కృషి చేశా
- డీసీసీ అధ్యక్షునిగా రాహుల్ గాంధీ ఆలోచనలతో ప్రయాణం
- కాంగ్రెస్ పార్టీ మేయర్ పదవి సొంతం చేసుకుంటుంది
- వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

**అక్షరశక్తి, హన్మకొండ:** విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో 1985లో ఖమ్మం జిల్లాలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఎస్ఎఫ్ఐ విభాగంలో పనిచేసిన అనుభవం, కుటుంబంలో మామ చంద్ర శేఖర్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా ఉండడం వల్ల రాజకీయ వాతావరణం ఇనగాలకు కొత్త కాదు. 2012లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, అనేక ఆటుపోట్లు ఎదుర్కొని, క్రమశిక్షణ గలిగిన కాంగ్రెస్ సైనికుడిగా ఎదిగానని ఇనగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు, కార్యకర్తలతో ఉంటూ, పార్టీ ఆదేశాల మేరకు ఎక్కడ పని చెయ్యమని చెప్పినా అక్కడ పూర్తి నిబద్ధతతో పని చేస్తానని, పరకాల కాంగ్రెస్ పటిష్ఠతకు శక్తి వంచన లేకుండా కృషి చేశానని, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ గా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చానని, డీసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఆలోచనలతో ప్రయాణం చేస్తున్న అని చెబుతూ వచ్చే ఎన్నికల నాటికి పార్టీ నుంచి పోటీలో ఉంటా అని అనేక విషయాలను డిజిటల్ మీడియాతో పంచుకున్నారు.

**రాజకీయ ప్రస్థానం...**

వరంగల్ జిల్లా ఆత్మకూరుకు చెందిన ఇనగాల వెంకట్రామిరెడ్డి 2012లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో 2014లో పరకాల బరిలో దిగారు. అప్పుడు అక్కడ నాకు సరైన కేడర్ లేకున్నా 35 వేల ఓట్లను సాధించగలిగాను. అయినా నిరుత్సాహ పడకుండా పార్టీ కోసం పని చేశాను. ప్రతీ గ్రామం తిరుగుతూ పార్టీ పటిష్ఠతకు శక్తి వంచన లేకుండా పని చేశానని అన్నారు. నియోజక వర్గంలో పార్టీ తరపున 40 వేల సభ్యత్వాలను నమోదు చేయించాను. కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణం, బలమైన కార్యకర్తలను తయారు చేసుకోవడానికి వారితో కలిసి తిరిగాను. 2018లో కొండా సురేఖ మళ్ళీ కాంగ్రెస్ కి రావడంతో అప్పటి రాజకీయ సమీకరణాలు, అధిష్ఠానం ఆదేశాల మేరకు పని చేస్తూ వచ్చాను. దానికి గుర్తింపుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మెన్ గా, హన్మకొండ డీసీసీ అధ్యక్షుడిగా ప్రజలకు మంచి అవకాశాన్ని పార్టీ కల్పించిందని అన్నారు.

**ప్రజలకు సేవ చెయ్యడం కోసమే ట్రస్ట్....**

పార్టీలో పని చేస్తున్నప్పుడు ప్రజలకు, కార్యకర్తల కుటుంబాలకు సేవ చెయ్యడమే ఎక్కువ సంతోషాన్ని ఇస్తుంది. "ఇనగాల చారిటబుల్ ట్రస్ట్" ద్వారా చేసిన సేవలకు నాకు ప్రజల్లో మంచి గుర్తింపు లభించింది అని అన్నారు. ట్రస్ట్ ద్వారా ఎనిమిది ఓపెన్ హార్ట్ సర్జరీలు చేయించాం. అనారోగ్యం, ఆపద వచ్చినప్పుడు అర్ధరాత్రి అయినా అందుబాటులోకి వస్తాను. పరకాల నియోజక వర్గంలో చాలా మందికి వైద్య సేవలు అందించాము. ప్రతీ నెల ప్రజల ఇండ్లలో జరిగే ఫంక్షన్ లకు, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. 2025 లో ఎంజీఎం వైద్య సేవల కోసం కోటి రూపాయలు అందించారు. ఇప్పుడు పరకాలలో డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి తెచ్చేందుకు నా వంతుగా 50 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

**కుడాకు ఆదాయం సమకూర్చా...**

కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) చైర్మెన్ గా నగర అభివృద్ధి కోసం చేసిన పని సంతృప్తినిచ్చింది. అనేక రకాల స్కీమ్ లు ప్రవేశపెట్టాను. రైతులను ఒప్పించి స్వచ్ఛందంగా భూములు సేకరించడం జరిగింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా 225 ఎకరాల భూమి తీసుకోవడం వల్ల కుడాకు సుమారు నాలుగు వందల నుండి ఐదు వందల కోట్ల ఆదాయం లభించింది.

**రాహుల్ గాంధీ విజన్ తో ముందుకు...**

ఎలాంటి రికమండేషన్ లేకుండా డీసీసీ అధ్యక్షుడిగా పదవి లభించింది. సంఘటన్ సృజన్ అభియాన్ లో రాహుల్ గాంధీ విజన్ ప్రకారం నన్ను అధ్యక్షుడిని చేశారు. వారి నమ్మకాన్ని నిలబెట్టడం కోసం కలెక్టివ్ లీడర్షిప్ చేస్తూ కార్యకర్తలను ఒక్కటి చేసే ప్రయత్నాలు జరిగాయి. 13 మండలాల్లో ప్రతీ గ్రామంలో బూత్ కమిటీలు, మండల కమిటీలు వేసి వారి రిపోర్టులను పార్టీ వెబ్ సైట్ లో ఈ నెల 31లోగా పొందుపరిచే ప్రణాళిక సిద్ధం చేశాను. కాంగ్రెస్ లో యువతకు అవకాశాలు ప్రాధాన్యం ఇవ్వాలన్న రాహుల్ గాంధీ ఆలోచనల ప్రకారం పార్టీ కోసం పని చేసిన యువతకు పదవులు ఇస్తున్నాం. అతి పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ లో అందరినీ సంతృప్తి పరచలేము, విమర్శలు సాధారణమే అని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేయర్ పదవి సొంతం చేసుకోవడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ లో స్వంతంగా 46 నుండి 48 సీట్లు గెలుచుకుంటామని తెలిపారు.

**వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా...**

**రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటి చేస్తానని, ఎమ్మెల్యే రేసులో ఉన్నానని స్పష్టం చేస్తున్నారు. పరకాల నుండి మళ్లీ రేవూరి ప్రకాష్ రెడ్డి పోటీ చేస్తాడని ముఖ్యమంత్రి చెప్పాడు కదా అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ అది వ్యూహాత్మక ప్రకటన అని స్పష్టం చేశారు. పరకాలలో ముఖ్యమంత్రి అధికారిక సభ కాబట్టే వెళ్లలేదని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపాడు. ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణలు, డీ లిమిటేషన్ లో నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని తెలిపారు. అప్పుడు ఇనగాల అనే వ్యక్తి ఖచ్చితంగా పోటీలో ఉంటాడని స్పష్టం చేశారు.**

# డిజిటలైజేషన్, పునరుత్పాదక ఇంధనంతో విద్యుత్ రంగంలో మార్పులు

**అక్షరశక్తి,హైదరాబాద్:** డిజిటలైజేషన్, పునరుత్పాదక ఇంధనంతో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో నిర్వహించిన ఇండియా ఎనర్జీ సమ్మిట్-ఎక్స్‌పో 2026లో 'స్మార్ట్ గ్రిడ్స్-విద్యుత్ భవిష్యత్తు' అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడారు.




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్ డిజిటలైజేషన్, స్మార్ట్ మీటరింగ్ ద్వారా విద్యుత్ నష్టాలను గుర్తించి ఆదాయాన్ని పెంచుతున్నామని తెలిపారు. రానున్న 3-4 ఏళ్లలో విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గే అవకాశం ఉందన్నారు. పునరుత్పాదక ఇంధనం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ ద్విదిశగా మారుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీక్ అవర్స్‌ను నియంత్రించేందుకు నిల్వ వ్యవస్థలు, విద్యుత్ వాహనాల చార్జింగ్ కేంద్రాలకు ప్రోత్సాహకాలు అవసరమని సూచించారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో విద్యుత్ లోపాలను వేగంగా గుర్తించి నాణ్యమైన సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు.

# బీఆర్ఎస్ నాయకుడు జోరిక రమేష్ ముందస్తు అరెస్టు






**అక్షరశక్తి, హన్మకొండ :** నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళనకు పిలుపునివ్వడంతో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గ్రేటర్ వరంగల్ మాజీ కార్పోరేటర్, పార్టీ నాయకులు జోరిక రమేష్‌ను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెద్ది విగ్రహాన్ని కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు.

# నర్సంపేటలో బీఆర్ఎస్ ఆందోళన

**పెద్ది విగ్రహం కూల్చివేతపై నాయకుల మండిపాటు**



**అక్షరశక్తి,నర్సంపేట :** నర్సంపేట మాజీ శాసనసభ్యులు దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపుపై నర్సంపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అడుగడుగునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ది విగ్రహం కూల్చివేతపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. నిరసనగా నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. పెద్ది విగ్రహాన్ని కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, నర్సంపేటలో మెడికల్ కాలేజ్ ఎదురుగా పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మ రోజు పార్టీ నాయకులు ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. దానిని నిన్న రాత్రి మూడు గంటల సమయంలో 1500 మంది పోలీసుల మధ్య విగ్రహాన్ని తొలగించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను రాత్రికి రాత్రి అరెస్టు చేసి విగ్రహాన్ని తొలగించారు. విగ్రహం అసైన్డ్ ల్యాండ్ లో ఉందని అది ప్రభుత్వ భూమి అని కూల్చివేసినట్లు సమాచారం. విగ్రహాన్ని తొలగించడం, నాయకుల అరెస్టులకు నిరసనగా ఈరోజు వివిధ మండల కేంద్రాలలో నర్సంపేట అంబేద్కర్ సెంటర్లో దొంతి మాధవ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.



# కెమెరా కంటితో చరిత్రకు జీవం..
# గోకారపు శ్యాంకుమార్

23 ఏళ్ల ఫొటో జర్నలిజం ప్రస్థానం..

## తెలంగాణ ఉద్యమం నుంచి మేడారం జాతర దాకా ప్రత్యేక ముద్ర

## రాష్ట్ర, జాతీయ స్థాయిలో 20కిపైగా పురస్కారాలు..

## ప్రజా సమస్యలకు చిత్రరూపం





**అక్షరశక్తి, వరంగల్:** ఒక చిత్రం.. వెయ్యి మాటలు చెబుతుంది. ఒక మంచి చిత్రం.. ఒక కాలాన్ని కళ్లముందు నిలబెడుతుంది. ఒక చారిత్రక చిత్రం.. తరతరాలకు గతాన్ని పరిచయం చేస్తుంది. అలాంటి చిత్రాలను తన కెమెరాలో బంధిస్తూ 23 ఏళ్లుగా ఫొటో జర్నలిజంలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు గోకారపు శ్యాంకుమార్. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన రోజుల నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు.. ప్రజా ఉద్యమాల నుంచి పండుగల వైభవం వరకు.. మేడారం మహాజాతర నుంచి ప్రజా సమస్యల వరకు.. ఎన్నో కీలక ఘట్టాలకు ఆయన కెమెరా సాక్ష్యంగా నిలిచింది. విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీపై ఆసక్తి పెంచుకున్న శ్యాంకుమార్.. ఆ మక్కువతోనే చదువును మధ్యలోనే నిలిపివేసి వీడియో రంగంలోకి అడుగుపెట్టారు. తొలి నాళ్లలో వివాహ వేడుకలు, చిన్నచిన్న కార్యక్రమాలను చిత్రీకరిస్తూ వృత్తిలో కొనసాగారు. క్రమంగా ఆర్థికంగా నిలదొక్కుకుంటూనే.. కేవలం వేడుకలను మాత్రమే కాదు, సమాజంలోని సమస్యలను కూడా కెమెరా ద్వారా ప్రపంచానికి చూపించాలనే ఆలోచనతో పత్రికా రంగం వైపు అడుగులు వేశారు. గత 16 ఏళ్లుగా ది హన్స్ ఇండియాలో ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తున్న శ్యాంకుమార్.. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో సుమారు 20 అవార్డులు, జాతీయస్థాయిలో రెండు పురస్కారాలు అందుకున్నారు.

**పాత్రికేయ ప్రస్థానానికి పునాది**

సుమారు 23 ఏళ్ల క్రితం ఆంధ్రభూమి దిన పత్రికలో ఫోటో జర్నలిస్టుగా శ్యాంకుమార్ పాత్రికేయ ప్రస్థానం ప్రారంభమైంది. అప్పట్లో ఆంధ్రభూమి బ్యూరో చీఫ్‌గా ఉన్న వెల్జాల చంద్రశేఖర్ సూచనలు, సలహాలు ఆయనకు ఎంతో మార్గదర్శకంగా నిలిచాయి. వార్తకు తగ్గట్టుగా ఎలాంటి చిత్రం అవసరం? ప్రజా సమస్యను ఒక్క ఫ్రేమ్‌లో ఎలా చెప్పాలి? సాధారణ దృశ్యాన్నే ప్రత్యేకమైన వార్తాచిత్రంగా ఎలా మలచాలి? వంటి ఎన్నో మెళకువలను ఆయన నుంచి నేర్చుకున్నారు. ఆ పునాదులపైనే తనదైన శైలిని అభివృద్ధి చేసుకుంటూ.. సమాజాన్ని ఆలోచింపజేసే, సమస్యలను ప్రశ్నించే, చరిత్రను భద్రపరిచే చిత్రాలను కెమెరాలో బంధించడం ప్రారంభించారు.

**బతుకమ్మ చిత్రంతో తొలి పురస్కారం**

ఫోటోగ్రఫీలో తన ప్రతిభకు తొలి గుర్తింపు బతుకమ్మ చిత్రంతో లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో వరంగల్ నుంచి పాల్గొన్న శ్యాంకుమార్.. బతుకమ్మ పండుగ చివరి రోజున మహిళలు బతుకమ్మ ఆడుతున్న దృశ్యాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. ఆ ఫొటోకు ప్రత్యేక బహుమతి లభించగా.. అప్పటి ఆంధ్రప్రదేశ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అదే ఆయన ఫోటోగ్రఫీ ప్రస్థానంలో తొలి పెద్ద గుర్తింపుగా నిలిచింది. ఆ తర్వాత 2011లో ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో రెండో బహుమతి సాధించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆ పురస్కారాన్ని స్వీకరించారు.

**మేడారం.. కెమెరాకు అసలైన పరీక్ష**


సమ్మక్క-సారలమ్మ మేడారం మహాజాతర ఫోటో జర్నలిస్టులకు ఎప్పటికీ ఒక పెద్ద సవాలే. లక్షలాది మంది భక్తుల మధ్య వనదేవతల రాకను, జాతరలోని కీలక ఘట్టాలను చిత్రీకరించాలంటే అప్రమత్తతతో పాటు ఎంతో శ్రమ అవసరం. “లక్షలాది మంది భక్తుల మధ్య మేడారం జాతరలో పనిచేయడం యుద్ధభూమిలో పనిచేసినట్టే. వనదేవతలను తీసుకురావడం, ఆ దృశ్యాలను కెమెరాలో బంధించడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. అలాంటి చారిత్రక ఘట్టాలను చిత్రీకరించే అవకాశం రావడం ఫోటో జర్నలిస్టులుగా మా అదృష్టం”** అని శ్యాంకుమార్ పేర్కొంటారు. మేడారం జాతరలోని భక్తి, భావోద్వేగం, జనసందోహం, సంప్రదాయం, వనదేవతల ఆరాధన వంటి అనేక కోణాలను తన కెమెరాలో బంధిస్తూ ఆ జాతర ఫోటో జర్నలిజంలో తనదైన ముద్ర వేశారు.

**తోటి జర్నలిస్టుల కోసం మరో పోరాటం**

ఫోటో జర్నలిస్టుగా వృత్తిని కొనసాగిస్తూనే తోటి జర్నలిస్టులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు శ్యాంకుమార్. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి కుటుంబాల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అలాగే **TUWJ H143 హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా యూనియన్ కార్యకలాపాల్లో భాగస్వామ్యమవుతూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. వృత్తిపరంగా కెమెరాతో ప్రజా సమస్యలకు అద్దం పడుతూనే.. మరోవైపు జర్నలిస్టుల హక్కుల కోసం తన వంతు బాధ్యత నిర్వర్తిస్తున్నారు.

**ఓ ఫ్రేమ్‌లో ఓ కాలం..**

23 ఏళ్ల ప్రస్థానంలో గోకారపు శ్యాంకుమార్ కెమెరా ఎన్నో దృశ్యాలను చూసింది. తెలంగాణ ఉద్యమం చూసింది.. రాష్ట్ర ఆవిర్భావాన్ని చూసింది.. ప్రజల పోరాటాలను చూసింది.. పండుగల సందడిని చూసింది.. మేడారం మహాజాతరలో భక్తి ప్రవాహాన్ని చూసింది.. ప్రజా సమస్యల వెనుక ఉన్న కన్నీటిని చూసింది. ఆ ఫొటోలు ఇప్పుడు కేవలం పత్రికా పేజీల్లోని వార్తాచిత్రాలు కావు. అవి ఒక కాలానికి సాక్ష్యాలు. ఒక ఉద్యమానికి ఆనవాళ్లు. ఒక సమాజానికి దర్పణాలు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ఫోటో జర్నలిస్టులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఫోటో జర్నలిస్టులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



### ఉద్యమానికి కెమెరా సాక్ష్యం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం శ్యాంకుమార్ ఫోటో జర్నలిజం ప్రస్థానంలో అత్యంత కీలకమైన అధ్యాయం. ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించే వరకు జరిగిన అనేక కీలక ఘట్టాలకు ఆయన కెమెరా సాక్ష్యంగా నిలిచింది. ఉద్యమకారుల ఆందోళనలు.. ప్రజా ఉద్యమాలు.. ర్యాలీలు.. నిరసనలు.. వివిధ కార్యక్రమాలు.. తెలంగాణ ఆకాంక్షను ప్రతిబింబించిన ఎన్నో దృశ్యాలను ఆయన ప్రత్యక్షంగా చిత్రీకరించారు. ఆ సమయంలో కెమెరా ఆయనకు కేవలం వృత్తి సాధనం కాదు.. ఉద్యమ చరిత్రను భద్రపరిచే ఆయుధంగా మారింది. తెలంగాణ రాష్ట్రం 2014లో ఆవిర్భవించిన అనంతరం.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా 2016లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. ఇందులో వరంగల్ నుంచి *ఉత్తమ ఫోటో జర్నలిస్టుగా గోకారపు శ్యాంకుమార్ ఎంపికయ్యారు.* అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తాను తెలంగాణ ఉద్యమంలో చిత్రీకరించిన ఫొటోలకు ప్రభుత్వ గుర్తింపు రావడం తెలంగాణ బిడ్డగా తనకు ఎంతో సంతృప్తి, ఆనందాన్ని కలిగించిందని శ్యాంకుమార్ చెబుతారు.

GUEST COLUMN

# ప్రశ్నించే జన్‌జీ యువత కాదు.. నేర రాజకీయాలే ప్రజాస్వామ్యానికి ముప్పు



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

ప్రధాని ప్రసంగాన్ని పరిశీలిస్తే అసలు ప్రశ్న మాత్రం వేరే. దేశంలో యువతను వీధుల్లోకి తీసుకొచ్చిన నిరుద్యోగం, పరీక్షల నిర్వహణపై నమ్మకం కోల్పోవడం, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలోని లోపాలు, జీవన వ్యయాల పెరుగుదల వంటి సమస్యలను రాజకీయంగా ఎదుర్కోవడం కంటే వాటికి ప్రత్యామ్నాయంగా కొత్త నినాదాలు ఇవ్వడం సరిపోతుందా? పరీక్షల వ్యవస్థపై విశ్వాసం దెబ్బతిన్నప్పుడు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రకటించడం కొంత ఉపశమనాన్ని ఇవ్వవచ్చు. కానీ పరీక్ష ప్రశ్నపత్రం భద్రత, నియామక ప్రక్రియ పారదర్శకత, పరీక్షా సంస్థల జవాబుదారీతనం, లక్షలాది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభుత్వ బాధ్యత వంటి మూల సమస్యలకు అది సమాధానం కాదు.

ఇక్కడే "దిమాగీ నక్సల్స్" అనే పదప్రయోగం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. సాయుధ నక్సలిజం దాదాపు అంతరించిపోయిందని ప్రధానమంత్రి మోదీ , హోం మంత్రి అమిత్ షా స్వయంగా చెబుతూనే ఉన్నారు, కానీ ఈ నక్సల్ భావజాలాన్ని మోసేవారు వ్యవస్థల్లో ఇంకా ఉన్నారని హెచ్చరించారు. ప్రశ్న ఏమిటంటే...ఒక భావజాలాన్ని సమర్థిస్తున్నారని భావించిన వారిని ఎవరు నిర్ణయిస్తారు? ప్రభుత్వ విధానాలను విమర్శించే విద్యార్థి, జర్నలిస్టు, అధ్యాపకుడు, పరిశోధకుడు, సామాజిక కార్యకర్త ఎప్పుడు "విద్రోహి" అవుతాడు? ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదు.అది రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛలో అది అంతర్భాగం. జెన్ జీ యువత విసురుతున్న ప్రశలకు సమాధానం చెప్పలేక మోదీ తడబడుతూ ... మాటిమాటికీ తాను రాసుకొచ్చిన పేపర్‌లోకి చూస్తూ పసలేని ప్రసంగం చేశారు.గత 12 ఏళ్ళుగా చేసిన వాగ్దానాలే మాటలు మార్చి చెప్పటమే కానీ ఆచరణలో కనిపించదు.

గతంలో అరిగిపోయిన "అర్బన్ నక్సల్", "దేశద్రోహి", పదాలకు బదులు ప్రధాన మంత్రి ఈ దేశంలో తననూ,తన మంత్రి వర్గాన్ని, గోదీ మీడియా తప్పుడు కథనాలను, అసమర్థ పాలనా పద్ధతులను ప్రశ్నించే జన్‌జీ యువతరాన్ని ఇప్పుడు "దిమాగీ నక్సల్" వంటి ముద్రలు వేయడం రాజకీయ వాదనకు ప్రత్యామ్నాయాలు కాలేవు. ఒక అభిప్రాయాన్ని తప్పుబట్టాలంటే దానికి వాస్తవాలతో సమాధానం ఇవ్వాలి. ఒక ఉద్యమాన్ని వ్యతిరేకించాలంటే దాని డిమాండ్లను పరిశీలించి ప్రత్యామ్నాయ విధానాన్ని చూపాలి. అంతేకానీ ఇలా పనికిరాని లేబుల్స్ వేయడం సులభం. అయితే ఈ యువత ప్రధాన మంత్రి కొత్త బెదిరింపులకు భయపడే తరం కాదు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టంమై ...మాటలు తడబడి పేలవంగా ఉపన్యాసం ఇచ్చినట్లు మీడియాలో వ్యంగ్యంగా మీమ్స్ వస్తున్నాయి. అందుకే ప్రజాస్వామ్యానికి అసలు పరీక్ష ప్రభుత్వం తనను ప్రశ్నించే గొంతులను ఎలా చూస్తుందన్నదే ప్రధానం. ఒక వైపు ఆరెస్సెస్ నేత మోహన్ భగవత్ యువత ప్రశ్నించటం తప్పుకాదు.వారు మన పిల్లలు, వారి వయసులో తాను కూడా అలాగే ప్రశ్నించాను అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుంటే.. మోదీ మాత్రం ప్రశ్నించే ప్రజలను "దిమాగీ నక్సలస్" అంటున్నారు.

ఇదే సందర్భంలో మరొక అసౌకర్యకరమైన వాస్తవం మన ముందుంది...చట్టసభల్లో నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల పెరుగుదల. ఇక్కడ ఒక ముఖ్యమైన న్యాయపరమైన తేడాను గుర్తించాలి. క్రిమినల్ కేసు ఉన్న ప్రతి వ్యక్తి నేరస్థుడు కాదు; నేరం రుజువయ్యే వరకు అతను చట్టపరంగా నిర్దోషే. అయితే ప్రజాప్రతినిధులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటం మాత్రం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరిక.

అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదికల ప్రకారం రాజ్యసభలో 31 శాతం మంది సభ్యులు (69 మంది) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అఫిడవిట్లలో వెల్లడించారు. వీరిలో 16 శాతం మంది (36 మంది) హత్య, హత్యాయత్నం, మహిళలపై దాడుల వంటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. 2024 లోక్‌సభలో 46 శాతానికి పైగా ఎంపీలు క్రిమినల్ కేసులు ప్రకటించారు. తాజా ఏకీకృత ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం 543 మంది కొత్త లోక్‌సభ సభ్యుల్లో 251 మంది అంటే 46 శాతం మంది క్రిమినల్ కేసులు ప్రకటించగా, 170 మంది అంటే 31 శాతం మంది తీవ్రమైన కేసులు ప్రకటించారు. 2009లో తీవ్రమైన కేసులు ప్రకటించిన ఎంపీలు 76 మంది (14 శాతం) మాత్రమే ఉండగా, 2024లో ఆ సంఖ్య 170కి పెరిగింది—124 శాతం పెరుగుదల.

ఇక్కడ మరింత ఆందోళన కలిగించే అంశం ఎన్నికల రాజకీయాల స్వభావం. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం 2024లో క్రిమినల్ కేసులు ప్రకటించిన అభ్యర్థి గెలిచే అవకాశం 15.3 శాతం ఉండగా, క్లీన్ రికార్డు ఉన్న అభ్యర్థికి అది కేవలం 4.4 శాతం. అంటే నేర ఆరోపణలు ఉన్న అభ్యర్థులు ఎన్నికల్లో గెలవడానికి ఎక్కువ అవకాశాలు పొందుతున్న రాజకీయ వాస్తవం మన ముందుంది. ఇది ఒక్క పార్టీ సమస్య కాదు. బీజేపీకి చెందిన 240 మంది విజేతల్లో 94 మంది (39 శాతం), కాంగ్రెస్ 99 మందిలో 49 మంది (49 శాతం), సమాజ్‌వాదీ పార్టీ 37 మందిలో 21 మంది (45 శాతం), టీఎంసీ 29 మందిలో 13 మంది (45 శాతం), డీఎంకే 22 మందిలో 13 మంది (59 శాతం), టీడీపీ 16 మందిలో 8 మంది (50 శాతం), శివసేన 7 మందిలో 5 మంది (71 శాతం) క్రిమినల్ కేసులు ప్రకటించారు.

అందువల్ల నేర రాజకీయాలపై పోరాటం పార్టీ రాజకీయాలకు అతీతమైన ప్రజాస్వామ్య సంస్కరణగా ఉండాలి. అధికారంలో ఉన్నప్పుడు ఒక పార్టీపై, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో పార్టీపై మాత్రమే వేలెత్తడం సమస్యను పరిష్కరించదు. అన్ని పార్టీలు గెలుపు సామర్థ్యం, ధనబలం, అంగబలం కంటే అభ్యర్థి ప్రజా ప్రతిష్ఠ, నైతిక ప్రమాణాలను ప్రాధాన్యంగా తీసుకోవాలి.

సుప్రీంకోర్టు కూడా ఈ ప్రమాదాన్ని పదేపదే గుర్తించింది. పబ్లిక్ ఇంటరెస్ట్ ఫౌండేషన్ కేసు తరువాత రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల నేరచరిత్రను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యతను కోర్టు స్పష్టం చేసింది. అభ్యర్థి నేరచరిత్రను పార్టీ వెబ్‌సైట్‌లో ఉంచడంతో పాటు, పత్రికలు మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని కూడా ఆదేశించింది. అయినప్పటికీ ఎన్నికల రాజకీయాల్లో "గెలిచే అభ్యర్థి" అనే ప్రమాణం తరచుగా "మంచి అభ్యర్థి" అనే ప్రమాణాన్ని వెనక్కి నెడుతోంది.బీజేపీ గత దశాబ్ద కాలంలో ఇలాంటి వాషింగ్ మెషిన్ రాజకీయాలను చాలానే చేసింది.అవన్నీ మర్చిపోయి... ఇదే సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రశ్నిస్తే వారిపై దేశద్రోహం, విద్రోహం, నక్సలిజం వంటి ముద్రలు వేయడం ప్రజాస్వామ్య చర్చను మరింత సంకుచితం చేస్తుంది. యువత ఉద్యమాన్ని అంగీకరించకపోవచ్చు; వారి పద్ధతులను విమర్శించవచ్చు; చట్టవిరుద్ధ చర్యలుంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ మొత్తం విద్యార్థి సమాజాన్నే అనుమానితులుగా చూడడం మాత్రం ప్రమాదకరం. ఎందుకంటే ప్రశ్నించే యువతే రేపటి ఓటర్లు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, పరిపాలకులు, ప్రజాప్రతినిధులు.

ప్రధాని 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరోసారి ముందుకు తెచ్చారు. కానీ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక పరిమాణాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సామర్థ్యం మాత్రమే కాదు. న్యాయవ్యవస్థపై విశ్వాసం, స్వేచ్ఛాయుత మీడియా, బలమైన విద్యాసంస్థలు, పారదర్శక ఎన్నికలు, నేరరహిత రాజకీయాలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు—ఇవన్నీ అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్యానికి కొలమానాలు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతున్న మాటల్లో నిజం లేదని దాదాపు 80 కోట్ల మంది ఉచిత ఆహార ధాన్య పథకంపై ఆధారపడుతున్నారన్న వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వమే చెపుతుంది. ఒకవైపు ఆర్థిక పురోగతి గణాంకాలు, మరోవైపు ఆహార భద్రత కోసం భారీ స్థాయిలో ప్రభుత్వ సహాయం—ఈ రెండు వాస్తవాలను కలిపి చూసినప్పుడే దేశ ఆర్థిక స్థితి గురించి నిజమైన చిత్రం బయటపడుతుంది. "వికసిత్ భారత్" ఒక అరిగిపోయిన రికార్డు నినాదంగా మిగిలిపోయింది. ఆ నినాదం ప్రజల జీవన ప్రమాణాల్లో కనిపించే వాస్తవంగా కనిపించాలి కదా!?.

అలాగే 650 కొత్త విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయని చెప్పడం కంటే వాటి నాణ్యత, అధ్యాపకుల స్థాయి, పరిశోధన సామర్థ్యం, విద్యార్థుల ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రాప్యత గురించి మాట్లాడటం అవసరం. విశ్వవిద్యాలయాల సంఖ్య పెరగడం మాత్రమే ఉన్నత విద్యా విప్లవం కాదు. ఆలోచనా స్వేచ్ఛను కాపాడటం, విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం ముఖ్యం.

> స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి చేసే ప్రసంగం దేశానికి ప్రభుత్వ విధానాల దిశను, పాలనలోని ప్రాధాన్యతలను, భవిష్యత్తు లక్ష్యాలను తెలియజేసే సందర్భం. ఆగస్టు 15, 2026న నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం సుమారు 75 నిమిషాలపాటు సాగింది. యువతకు ఉచిత ఆన్‌లైన్ పోటీ పరీక్షల శిక్షణ, కోటి మంది యువతకు కృత్రిమ మేధపై శిక్షణ, 2047 నాటికి వికసిత్ భారత్ వంటి అంశాలను ప్రస్తావించిన ఆయన, అదే సమయంలో కొత్తగా "దిమాగీ నక్సల్స్" అనే పదాన్ని రాజకీయ చర్చలోకి తీసుకొచ్చారు.

స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం దేశాన్ని ఏకం చేసే సందర్భం. అందులో రాజకీయ ప్రత్యర్థులను, విమర్శకులను లేదా నిరసనకారులను కొత్త పేర్లతో గుర్తించడం కంటే, దేశ ప్రజల ఆందోళనలకు సమాధానాలు ఇవ్వడం మరింత సముచితం. నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులను తన చుట్టూ పెట్టుకొని వారిని ప్రశ్నించకుండా విద్యార్థులను "క్రిమినల్స్"గా ముద్రించడం ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధమైన ద్వంద్వ ప్రమాణంగా మారుతుంది.

నిజమైన దేశభక్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంలో లేదు. దేశ ప్రజల హక్కుల కోసం ప్రశ్నించగల ధైర్యంలో ఉంది. నిజమైన ప్రజాస్వామ్య సంస్కరణ విద్యార్థుల గొంతును నొక్కేయడంలో లేదు; చట్టసభల్లో నేర రాజకీయాల ప్రభావాన్ని తగ్గించడంలో ఉంది. "దిమాగీ నక్సల్స్" కోసం దేశం వెతకాల్సిన అవసరం ఉందని ఎవరైనా భావిస్తే, ముందుగా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్న అసలు సమస్యలను—నేర రాజకీయాలు, ధనబలం, సంస్థలపై రాజకీయ ప్రభావం, జవాబుదారీతనం లోపం—గుర్తించాలి. ప్రశ్నించే విద్యార్థి దేశానికి శత్రువు కాదు; ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వ్యవస్థే ప్రజాస్వామ్యానికి అసలు ప్రమాదం.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.